# కరెంట్ అఫైర్స్

## రాష్ట్రపతి ఆస్ట్రేలియా పర్యటన

★ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా 2018, నవంబరు 22న ఆస్ట్రేలియా ప్రధానమంత్రి స్కాట్ మోరిసన్‌తో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవడంపై ఇరువురు నేతలు చర్చించారు.

★ ఈ సందర్భంగా దివ్యాంగులకు సేవలు అందించడం, పెట్టుబడులు, శాస్త్రీయ తోడ్పాటు నవకల్పనలు, సంయుక్త పీహెచ్‌డీ, వ్యవసాయ పరిశోధనలు - విద్య అనే అంశాల్లో రెండు దేశాల మధ్య అయిదు ఒప్పందాలు కుదిరాయి. ఇరువురు నేతలు న్యూసౌత్‌వేల్స్‌లో మహాత్మా గాంధీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోవింద్ ఆస్ట్రేలియా గవర్నర్ జనరల్ పీటర్ కాస్‌గ్రోవ్ ఆహ్వానం మేరకు ఈ పర్యటనకు వెళ్లారు. ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత తొలి రాష్ట్రపతిగా వార్తల్లో నిలిచారు.

## కిలోకి కొత్త నిర్వచనం

★ అంతర్జాతీయంగా ఇప్పటివరకూ ద్రవ్యరాశికి ప్రామాణికంగా భావిస్తూ వచ్చిన కిలోగ్రామ్ నిర్వచనం ఇక నుంచి మారనుంది. ఈ మేరకు ఒక ప్రతిపాదనను 2018, నవంబరు 16న ఫ్రాన్స్‌లోని వార్సలీస్‌లో జరిగిన సమావేశంలో 60 దేశాల పరిశోధకులు ఆమోదించారు.

★ ఇప్పటివరకు ఫ్రాన్స్‌లోని సెవరెస్ ప్రాంతంలోని ఇంటర్నేషనల్ బ్యూరో ఆఫ్ మెజర్‌మెంట్స్‌లో భద్రపరచిన ప్లాటినం - ఇరిడియం మిశ్రమ లోహాకృతి (లీగ్రాండ్‌కే)ని 129 సంవత్సరాలుగా కచ్చితమైన ఒక కిలోగ్రామ్‌గా పరిగణిస్తూ వచ్చారు. దీన్ని 1889లో తయారు చేశారు.

★ వివిధ దేశాలు నలభై ఏళ్లకు ఒకసారి తమ దగ్గర ఉన్న కిలోరాయిని సెవరెస్‌కు తీసుకెళ్లి దాని బరువుతో సరిచూసుకునేవి. దేశవ్యాప్తంగా దాన్నే ప్రమాణంగా తీసుకునేవారు. మనకైతే దిల్లీలోని నేషనల్ ఫిజికల్ ల్యాబొరేటరీలో 'లీగ్రాండ్‌కే'తో పోల్చి చూసే కిలోకడ్డీ ఉంటుంది. దీన్ని నంబరు 57 అంటారు. ప్రతి నలభై ఏళ్లకు ఒకసారి బయటకు తీసి 'లీగ్రాండ్‌కే'తో కొలిచి చూసేవారు.

★ 'లీగ్రాండ్‌కే' బరువు 50 మైక్రో గ్రాములు తగ్గిపోయిందని 2010లో గుర్తించారు. దీంతో భౌతిక నమూనా కిలో రాయిని కాలగర్భంలో కలిపేసి కిలోను విద్యుత్ శక్తితో కొలిచి తాజాగా సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చారు. 'కిబ్బుల్ బ్యాలెన్స్'తో నూతన కిలోగ్రామ్‌ను నిర్వచించారు. దీంతోపాటు ఉష్ణోగ్రతకు ప్రామాణికంగా భావించే కెల్విన్, విద్యుత్‌ను కొలిచే ఆంపియర్, అణువుల పరిమాణాన్ని కొలిచే మోల్ యూనిట్లను కూడా సవరించాలని తాజాగా నిర్ణయించారు.

★ వచ్చే ఏడాది మే 20 నుంచి కిలోగ్రామ్ నూతన నిర్వచనం అమల్లోకి రానుంది. శాస్త్రజ్ఞుల తాజా నిర్ణయంతో మనం ఉపయోగిస్తున్న కిలోరాయిలో ఏ మార్పురాదు. వీటన్నింటినీ తూచే నమూనా రాయి మాత్రమే మారింది. దాని స్థానంలో కిలోను నిర్వచించే విద్యుత్ శక్తి వచ్చింది.

## ఐరాస గుర్తింపు

★ తెలంగాణలో అమలవుతోన్న రైతు బంధు, రైతు బీమా పథకాలకు ఐక్యరాజ్య సమితి గుర్తింపు లభించింది. ప్రపంచ దేశాల్లో రైతుల అభివృద్ధి కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాల్లో 20 పథకాలను ఎంపిక చేస్తే వాటిలో ఈ రెండు పథకాలు ఉన్నాయి. ఈ పథకాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వాల్సిందిగా ఐరాస తెలంగాణ ప్రభుత్వానికి ఆహ్వానం పంపింది.

★ ఈ నేపథ్యంలో 2018, నవంబరు 21న రోమ్‌లో ఐరాసలోని వ్యవసాయ విభాగం 'ఎఫ్ఏఓ' (ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ) నిర్వహించిన 'అంతర్జాతీయ సృజనాత్మక వ్యవసాయ సదస్సు'లో రైతు బంధు, రైతు బీమా పథకాలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకులు డాక్టర్ కేశవులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'రైతు బీమా - ఇన్స్యూరింగ్ ఫార్మర్స్, ఎన్స్యూరింగ్ ప్రాస్పరిటీ' అగ్రికల్చర్ ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్ స్కీమ్ - రైతుబంధు' పేరిట రెండు డాక్యుమెంటరీలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

## ఉద్యోగార్హ నైపుణ్యంలో ఏపీ నంబర్ 1

★ 2018, నవంబరు 22, 23 తేదీల్లో లఖ్‌నవూలో జరిగిన అంతర్జాతీయ నైపుణ్య సదస్సులో విడుదల చేసిన 'ఇండియా స్కిల్స్ రిపోర్ట్ - 2019'లో దేశంలో అత్యధిక ఉద్యోగార్హ నైపుణ్యాలున్న (ఎంప్లాయిబిలిటీ స్కిల్స్) మానవ వనరులున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఈ విభాగంలో గతేడాది ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో ఉండగా ఈసారి మొదటి స్థానాన్ని సాధించింది. తాజా నివేదికలో తెలంగాణకు 8వ స్థానం దక్కింది. గత నివేదికలో మొదటి 10 స్థానాల్లోనూ తెలంగాణ లేదు.

★ పనిచేసేందుకు అత్యంత అనువైన వాతావరణం ఉన్న రాష్ట్రాల విభాగంలో, ఉద్యోగుల నియామకానికి వివిధ కంపెనీలు మొగ్గుచూపే రాష్ట్రాల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో, తెలంగాణ పదో స్థానంలో ఉన్నాయి.

★ ఉద్యోగార్హ నైపుణ్యాలున్న యువతను అత్యధికంగా సరఫరా చేసే రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ వరుసగా రెండోసారి అగ్రస్థానంలో ఉంది. ఈ విభాగంలో 2016, 2018, 2019 నివేదికల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో, 2017లో రెండో స్థానంలో నిలిచింది.

## ఇంటర్‌పోల్ అధ్యక్షుడిగా కిమ్‌జోంగ్ యాంగ్

★ అంతర్జాతీయ పోలీసు సంస్థ 'ఇంటర్‌పోల్' అధ్యక్షుడిగా దక్షిణ కొరియా మాజీ పోలీసు అధికారి కిమ్‌జోంగ్ యాంగ్ ఎన్నికయ్యారు. 2018, నవంబరు 21న దుబాయ్‌లో జరిగిన ఇంటర్‌పోల్ సర్వసభ్య సమావేశంలో ఈ పదవి కోసం పోటీపడిన రష్యా అభ్యర్థి అలెగ్జాండర్ ప్రొకొపుక్‌పై మూడింట రెండొంతుల మెజారిటీతో కిమ్ గెలుపొందారు.

★ ఇంతకుముందు ఇంటర్‌పోల్ అధ్యక్షుడిగా పనిచేసిన మెంగ్ హాంగ్‌వై (చైనా) అవినీతి ఆరోపణలతో సెప్టెంబరులో తన పదవికి రాజీనామా చేశారు.

★ కిమ్‌జోంగ్ యాంగ్ 2020 వరకూ ఈ పదవిలో ఉంటారు. ఇంటర్‌పోల్ ప్రస్తుత ఉపాధ్యక్షుడైన అలెగ్జాండర్ ప్రొకొపుక్ అభ్యర్థిత్వాన్ని అమెరికా నేతృత్వంలోని పశ్చిమ దేశాలు వ్యతిరేకించాయి.

## అండమాన్‌లో అమెరికా టూరిస్ట్ హత్య

★ అండమాన్ పర్యటనకు వెళ్లిన అమెరికా పర్యాటకుడు జాన్ అలెన్‌చావ్ (27) హత్యకు గురయ్యారు. అండమాన్ దీవుల సమూహంలోని ఉత్తర సెంటినెల్ ద్వీపంలో నివసించే అత్యంత ప్రమాదకర సెంటినెలిస్ తెగకు చెందినవారు అతడిని హత్య చేశారు.

★ బయటి ప్రపంచంతో సంబంధాలు పెట్టుకోవడానికి ఏ మాత్రం ఇష్టపడని వీరిని కలుసుకోవాలని ప్రయత్నించిన జాన్‌ను వారు బాణాలతో దాడి చేసి హతమార్చారు.

## ఆంధ్రప్రదేశ్‌లో 'భూధార్' ప్రారంభం

★ భూ వివాదాల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'భూధార్' పథకాన్ని 2018, నవంబరు 20న ఉండవల్లి నివాసంలోని 'ప్రజావేదిక' వద్ద సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.

★ భూధార్ కార్డులను రాష్ట్రవ్యాప్తంగా నవంబరు 21 నుంచి పొందే అవకాశాన్ని రెవెన్యూ శాఖ అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలోని 17,484 గ్రామాల్లోని వ్యవసాయ భూముల వివరాలు భూసేవ పోర్టల్ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. సర్వే నంబరు, సబ్ డివిజన్ల ఆధారంగా 11 అంకెల విశిష్ట సంఖ్యతో తాత్కాలికంగా భూధార్ కార్డులను పొందే అవకాశాన్ని అందుబాటులోకి తెచ్చింది.

## 53వ స్థానంలో భారత్

★ స్విట్జర్లాండ్‌కు చెందిన ఐఎండీ బిజినెస్ స్కూల్ నైపుణ్యాలకు సంబంధించి 2018, నవంబరు 20న విడుదల చేసిన అంతర్జాతీయ వార్షిక ర్యాంకుల్లో భారత్ 53వ స్థానంలో నిలిచింది. 2017లో మన ర్యాంకు 51.

★ తాజా జాబితాలో స్విట్జర్లాండ్ అగ్రస్థానంలో ఉంది. నైపుణ్యాల్లో స్విట్జర్లాండ్ అగ్రగామిగా నిలవడం వరుసగా ఇది అయిదో ఏడాది. ఆసియా దేశాల్లో అగ్రస్థానాల్లో నిలిచిన సింగపూర్ ప్రపంచ దేశాల్లో మాత్రం 13వ స్థానంలో ఉంది.

- అభివృద్ధి చెందుతున్న, నిపుణులను ఆకర్షిస్తున్న, నిలిపి ఉంచుకుంటున్న 63 దేశాలతో ఈ జాబితాను రూపొందించారు. తొలి అయిదు స్థానాల్లో వరుసగా స్విట్జర్లాండ్, డెన్మార్క్, నార్వే, ఆస్ట్రియా, నెదర్లాండ్స్ ఉన్నాయి.
- బ్రిక్స్ దేశాల్లో బ్రెజిల్ 58, రష్యా 46, చైనా 39, దక్షిణాఫ్రికా 50వ ర్యాంకుల్లో నిలిచాయి. వెనెజులా చివరిగా 63వ స్థానంలో ఉంది.
- ఉద్యోగానికి అవసరమైన నిపుణుల సంఖ్యాపరంగా మన దేశం 30వ స్థానంలో ఉంది. అయితే విద్యా వ్యవస్థ నాణ్యత, విద్యారంగంపై ప్రభుత్వ వ్యయాలపరంగా చూస్తే భారత్ 63వ స్థానంలో ఉంది.

## పంకజ్ అద్వానీ

- భారత బిలియర్డ్స్ దిగ్గజం పంకజ్ అద్వానీ 2018, నవంబరు 18న మయన్మార్‌లోని యాంగూన్‌లో నిర్వహించిన ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ ఛాంపియన్ షిప్ లాంగ్ అప్ ఫార్మాట్ టైటిల్‌ను గెలుచుకున్నాడు.
- ఫైనల్లో పంకజ్ భారత్‌కు చెందిన భాస్కర బాలచంద్రను 1500 - 299 పాయింట్లతో ఓడించాడు. ఈ టైటిల్‌ను పంకజ్ నెగ్గడం ఇది నాలుగోసారి.
- పంకజ్ కెరీర్ మొత్తం మీద ఇది 21వ ప్రపంచ టైటిల్. నవంబరు 15న ఇదే వేదికపై జరిగిన 150 పాయింట్ల ఫార్మాట్‌లోనూ పంకజ్ ప్రపంచ టైటిల్ సాధించాడు.

## ఇందిరా గాంధీ శాంతి పురస్కారం

- 2018 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక 'ఇందిరా గాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి పురస్కారం'ను దిల్లీకి చెందిన పర్యావరణ మేధో సంస్థ 'సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సీఎస్ఈ)'కి ప్రకటించారు. పర్యావరణ విద్య, పరిరక్షణలో చేసిన కృషికి గుర్తింపుగా సీఎస్ఈకి ఈ పురస్కారాన్ని ప్రకటించారు.
- 2017 సంవత్సరానికిగాను ఇదే పురస్కారాన్ని 2018, నవంబరు 19న దిల్లీలో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ప్రదానం చేశారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ సమక్షంలో పురస్కారాన్ని విశ్రాంత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్ ప్రదానం చేశారు.
- మాజీ ప్రధానమంత్రి, దివంగత ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని నవంబరు 19న ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

**రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్**

www.eenadupratibha.net